గోపాలంకేసి చూసి వసుంధర నవ్విందన్న వార్త కాలేజంతా వసుంధరవాడే 'కునేగా'లా గుప్పుమంది. సీనియర్సంతా సిన్సియర్ గా ఇడ్లీ ఉడికినట్లు ఉడికిపోయారు. మేమంతా ఒహాళ్ళమీద ఒహాళ్లపడి 'కంగ్రాట్సు' చెప్పాల్సి వచ్చింది. మరీ జూనియర్ స్టూడెంట్సు కొత్తగా ప్యాంట్లలోకి, అలాగే కాలేజీలోకీ వచ్చేసిన స్టూడెంట్స్ ముక్కులమీదనుంచి వేళ్ళు తీయడానికి ఒప్పుకోలేదు.

వసుంధర గుడ్డిదా లేకా గాంధారి బెపా, మెదతిప్పలేని మేనకా, నవ్వుటే ఎరగని నీతిమంతురాలా, నవ్వటానికి ప్రాక్టీసులేదా - మరింక దీనిలో విశేషమేమిటని అడగకపోయినా చెప్పాల్సిన బాధ్యతుంది నామీద.

# "యస్టర్డే టుడే టుమారో"

*

## మజుందార్

గోపాలం అనబడే గోపాత్రోవ్ మా క్లాస్‌మేట్-క్లాస్‌లో బెంచి మీట్, గదిలో స్టడీమీట్, హోటల్‌లో టేబిల్ మీట్-వేయేల దేవుడు మా యిద్దరికి కలిపి....అయిమీన్ మా యిద్దరి గుండెలక్కలిపి ఒకే పెరికార్డియం లేయర్ సృష్టించాడంటాడు మా బాబ్జి. అందరం బియస్సీ సెకండియర్‌లో చదువుకుంటున్నామనే వంకతో యీ గుంటూరులో వుంటున్నాము. మా సంగతేమోగాని, గోపాలనికి మాత్రం బోల్డు పెరిలెన్ పెయిర్స్, కోరినంత డబ్బు పంపేవాన్న. రేస్‌హార్స్‌లాంటి వెస్పాలెట్ సెట్రాలున్నాయి. చదవంటారా కాలక్షేపంగా బాగానే వుంటుంది.

వసుంధర వాటెబవుట్స్ కొద్దిగా మాత్రమే తెలుసు. తనూ సెకండియరే. మా క్లాసే. మా గ్రూపే. అందమంటారా? బాపుకు యిన్స్పిరేషన్ యిచ్చింది. రిటాహరియాకు ట్రెయినింగ్ యిచ్చింది. జయలలితకు అలా నడవడం నేర్పింది-వసుంధరే నంటాడు బాబ్జి. వసుంధరకు ఓమీసాల నాన్న ఉన్నాడు. పట్టాభిపురంలో మాంచి బంగ్లా వుంది. ఆ బంగ్లా గేటుకు కెప్టెన్ రాంప్రసాదనే బోర్డు వ్రేలాడేసి వుంటుంది. ఆ మీసాలాయనా, యీ బోర్డాసామి ఒహరేనంటారంతా. తరువాయి సంచికలో తెలిసిందేమిటంటే ఆ మీసాలు తాలుకు మనిషి వసుంధర బాబాయిగారుట. వాళ్ళింట్లోనే వుంటూ, చదువుకుంటున్నదనీను. కాని బాబ్జి అనటం మాత్రం చదువనే వంకతో గుంటూరు జనాన్ని 'చంపు'తున్నదని.

ఆ అమ్మాయి చాలా స్ట్రెయిట్ ఫార్వర్డ్ రిజర్వ్ టైపు. ఎవరితో ఎక్కువ మాట్లాడదు. (తోటి రెండు జడల వాళ్ళతో గూడ.) ఎవరివైపూ

చూడదు. అథవా చూసినా నవ్వదు. వసుంధరను ప్రేమిస్తున్న అసంఖ్యాక విద్యార్థి లోకంలో మా గోపాలం ఒక అల్పాణువు. ఏదో మూల, అఫ్

యినే చేసుకుంటాడుట లేకపోతే భీష్ముని రికార్డు బ్రేక్ చేస్తాడుట.

అసలు గోపాలం వసుంధరను చూడటం ఎప్పుడు తటస్థించిందో



కోర్సు. మేమూ ప్రేమిస్తున్నా మను కోండి. మా గోపాలం మాత్రం, నిఝంగా, సిన్సియర్‌గా ప్రేమిస్తు న్నాడు. పెళ్ళి చేసుకుంటే యీఅమ్మా

ముందు చెబుతాను. వాడు క్లాసుకు రావడమే గొప్ప! ప్రపంచంలో ఎనిమిదో వింత! వాడు క్లాసుకు వస్తే గుంటూరు యింకో కొయినా అయిందే! ఒకసారి

రాక రాక క్లాసుకొచ్చాడేమో క్లాసంతా క్రొత్తకొత్తగా, కొత్త అందాలతో కన పడ్డది. ఇంగ్లీషు క్లాసనుకుంటా జరుగు తోంది. మావాడు అమ్మాయిలబెంచీల వెనక జేరాడు. సరే ప్రక్కన నేను. వాడదృష్టంబాగుండో బాగుండకో వసుం ధర వీడిముందే కూర్చున్నది. (వీడే వసుంధర వెనుక కూర్చున్నాడని బాబ్జి అంటే గోపాలం వొప్పుకోడు) ఇంక చెప్పేదేముంది? లెక్చరర్ మాట చెవిన పడనిస్తేనా? లెక్చరర్ 'బోర్' వింటే 'మేడీజీ'ల అవసరం ఏముంది - పబ్లి షర్స్ - గైడ్ కర్తలూ బతకక్కర్లేదా అంటాడు. ఆ అమ్మాయి ఎవరు? అల్లాఉద్దీన్ ఖిల్జీ అద్దంలో చూసిందీమె నేనా-ఆంధ్రులేనా-బెంగాల్ భామినా, కాష్మీర్ కి కలియా-ఒహా టేగోల చెవి క్రింద. ముందున్నమ్మాయిలు కోరగా వెనక్కు తిరిగి చూసారు. నిశ్శబ్దంగా వున్న క్లాసులో ధ్వనితరంగాలు లెక్చ రర్ డయాస్ చేరుకోటానికి ఎక్కువ సేపు ఎందుకు పడ్తుంది?

"డౌట్ వస్తే అడగరాదూ? ఏఁవిటా గుసగుసలు?" అన్నాడు లెక్చరాపి అబ్బాయిలవైపు చూస్తూ. (అమ్మాయిల వైపుచూస్తే ఆ రోజు యింక లెక్చర్ సాగదుట-బాబ్జి ఉవాచలెండి) మన వాడు వున్నవాడు వుండక, రాత్రే ఏదో తెలుగు సినిమా చూసివున్నా డేమో "ఊహలు" అని అనేసి పుస్త కాన్ని క్లోజప్పులో చూడటం ప్రారం భించాడు. క్లాసులో నవ్వు....గోల!!

ఇంకేముంది? గురువుగారికి ఛాన్స్ దొరకనే దొరికింది అమ్మాయిల ముందు షైన్ కావడానికి- (అంటాడు బాబ్జి) "ఎందుకు డిగ్రీ క్లాసుకొచ్చారు? మానర్స్ తెలియవు - రెస్పాన్సి బిలిటీస్ తెలియవు...." సెర్మన్ పూర్త య్యాక క్లాసంకా ఒకసారి కలియ చూసి మళ్ళీ 'మాక్ బెత్'లోకి వెళ్తూ "ఆఁ ఎంతవరకు వచ్చాం?" అన్నారు. అంతవరకు ఎంతవరకు చెప్పాలో మరిచిపోయి. గోపాలంవించి తడుము కోకుండా వచ్చింది. రిప్లయ్. "ఇప్పుడే విచ్ క్రాఫ్ట్ స్పీచ్ అయింది" అప్పుడిక చూడాలి గోల - క్లాసంతా ఒహాటే నవ్వులు- బల్లలమీద చరచ టాలు, ఎలుకలు దడుచుకునేంత అరు పులు: అసలు విశేషమేమిటంటే వసుంధర అందంగా, జాజిపువ్వు కళ్ళముందువిచ్చుకుంటున్నట్టు, వెయ్యి గులాబులు ఒక్కసారే విచ్చుకున్నంత శబ్దంతో నాజూకుగా పిల్ల తెమ్మరలా నవ్వింది వెనక్కు తిరిగి (బాబ్జి అనటంమాత్రం కిసుక్కువ నవ్వి వెనక్కు తిరిగిందని) మనవాడది కాంప్లిమెంటరీగా తీసుకుని తనూ ప్రతి నవ్వు నవ్వాడు. అదీ ప్రథమ పరిచయం.

అప్పటినుంచి రెగ్యులర్ గా క్లాసు లకు రావడం ప్రారంభించాడు. ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ సంఘటన జరిగినప్పటి నుంచి

చదవడంకూడా ప్రారంభించాడు. ఆమె దృష్టి నాకర్షించడానికి పడరాని కష్టాలు పడ్డాడు. వీడివైపునుంచి లోపమేమి లేకుండా ప్రేమించసాగాడు. ఇలా యిలా జరుగుతుండగా బాటని సెక్షన్ కటింగ్ కరక్ట్‌గా వచ్చినట్లు, కెమిస్ట్రిలో రావాల్సిన రాడికల్ వచ్చేసినట్లు, కుడిచేయి చొక్కా మడతలోని క్వశ్చెన్స్ వచ్చినట్లు, పేపర్‌లో బోలెడంత ఛాయిస్ వున్నట్లు వసుంధర గోపాలంకేసి చూసినవ్వటం జరిగింది.

వీడివైపుచూసి ఎందుకు నవ్వింది? ఆ అమ్మాయి నవ్వినప్పుడు పొరపాటునో, ఏమరిపాటునో దగ్గరగా వున్నాడా? లాంగ్‌షాట్‌లో తెలుగు సినిమా హీరో, హీరోయిన్‌వి (కథ పొడిగించడానికి వీలయ్యే) కావలసిన మాటలే విన్నట్లు (హీరోయిన్ హీరో తమ్ముడితోనో మాజీ ప్రియుడితోనో "నిన్ను ప్రేమించాను" అని అనటం మాత్రమే వింటాడు. "కాని యిప్పుడొక గృహిణిను" "మరొకరి భార్యను-నీవు నన్ను కోరటం తగదు" మార్కు మాటలు వినడు) ఆమె నవ్వితే తననుచూసే అనుకున్నాడా అంటే కాదుట కాలేజంతా కోడై కూస్తుంటే! వీడ్నిచూసి, ఒక ఫ్రేమ్‌లో వున్నప్పుడే చూసి నవ్విందిట. ఆ వసుంధర నవ్వటం గదుగాని మా గోపాలం మాత్రం కాలేజీ కాంటీన్‌తో ఫయిరింజన్‌తో పనిలేకుండా ఆరిపోయాడు.

"గోపాలం ఏదో - ఫరవాలేదు బావుంటాడు" అనేవాళ్ళు చాలా తక్కువ, అతనికేమంది! ఛాకులాటి కుర్రాడు హాలివుడ్ హీరోలా వుంటాడు. అనేవాళ్ళతో పోల్చుకుంటే. వసుంధర నోట్సు సంపాదించడం కోసం రెండ్రోజులు కాలేజి మానేసాడు. (రూంలో "ఏంగురూ! నాకోసమేమయినా కళ్ళతో వెతికిందా?" అని ప్రాణం తీసాడనుకోండి) ఆ రెండ్రోజులు గడ్డం పెంచాడు. మరునాడు కాలేజికి అలానే వచ్చాడు నీరసంగా నవ్వుతూ. నాకు తెలుసు. ఆ వెధవ ప్లానంతా .... క్లాసయిపోయాక బాటనీ ప్రాక్టికల్స్ వున్నాయి. రెంటి మధ్య టయిముంది. అంతా గార్డెన్‌లోకి, కాంటీన్‌లోకి నోటీస్ [illegible] వైపూ వెళ్లారు. మేము లైబ్రరీవైపు దారితీశాం, మా ముందు వసుంధర వెళ్తున్న కారణాన. ఏ ముహూర్తమో గాని ప్రియంవదా దమయంతులెట్ సెట్రాలు వెంటలేరు. గోపాలం

---

● కొన్నాళ్ళ తరువాత కలసిన స్నేహితునితో

రామయ్య:- ఏరా? సోము నీకు ఈమధ్య చెముడొచ్చిందన్నారు నిజమేనా?

సోము:-అవునురా నాకు ముగ్గురు ఆడపిల్లలు ఇదరు మగపిల్లలు.

త్వరగా వసుంధర దగ్గరకు వెళ్ళాడు నామాట వినిపించుకోకుండ.

నేను అబ్జర్వ్ చేస్తూనే వున్నాను. ఏఁవిటి వీడి ధైర్యం? ఆ అమ్మాయి తాలూకు మీసాల మనిషి గుర్తులేడా? ఆ అమ్మాయి 'సత్యభామ'గా మారిన కథలు గుర్తులేవా? ఏఁవిటి సంగతి అనుకుంటూ మెల్లెక్కుతున్నాను. వెనుకనించి_వెనక వుండి.

"ఏమండీ...."

ఆ అమ్మాయి తన్నుకాదనుకుని వెళ్తున్నది. మళ్ళీ పిలిచాడు.

"ఏమండి వసుంధర్గారు...."

ఆగి అడిగింది. "ఏమండి పిలిచారా?" అని

గోపాలానికింక చెమటలు పోయసాగాయి. కాళ్లూ చేతులు వణుకుతున్నాయని నా అనుమానం.

"సహాయం."

---

### రచయితలకు మనవి

"జ్యోతి" కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పి పంపగోరితె రచనతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతోపాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని, అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలని మా విజ్ఞప్తి.

---

వసుంధర ఒక నిముషం వీడివైపు చూసింది చక్రాల్లా పెద్దవైన కళ్ళతో.

"అరె! మాఅన్నయ్య పేరు మీకెలా తెలుసు? వాడు తెలుసేమిటి మీకు?" అంది.

"అక్కె....బాదండి!"

"ఏమిటండీ మీరనేది? ఎవరిని బాదమంటారు?"

"అబ్బె కాదండి!" ధైర్యం పుంజుకుంటున్నాడు వెధవ....'నేను సెలవు రెండు....రోజులు" ఖంగారులో పదాలు దొర్లించి వాక్యం చేసుకోమన్నట్లు అన్నాడు.

"సారీ టూనోట్.... అయితే!" అంది వసుంధర వస్తున్న నవ్వాపుకుంటూ.

"మీ .... తెగులు" "ఛీ వెధవ ఖంగారూ వీడు!

"ఏమిటి మిష్టర్ తెగులంటున్నావ్? ఏమిటీ అల్లరి?"

"నో .... నో అదికాదండి_నేను జ్వరంవలన రెండురోజులు సెలవు పెట్టాను. మీ తెలుగునోట్స్ ఒకసారి యిస్తే రెండ్రోజుల్లో రిటర్న్ చేస్తాను." అమ్మయ్య! కర్త కర్మ క్రియతో వాక్యాలు నిర్మించగలుగుతున్నాడు.

"దానికేం భాగ్యమండి తీసుకోండి...." అని వసుంధర అనగానే ముందుకు వెళ్ళిన చెయ్యి అర్జంటుగా వెనక్కు వచ్చేసింది...."కాని ఇవాళ

తేలేదే" అన్న మాటలకు ఘోరంగా డిసాపయింట్ అయినట్లు వాడ్ని చూస్తేనే తెలుస్తుంది.

"పోనీ ఓపని చేస్తారా?" వసుంధర మాటలకు మళ్లీ చైతన్యం వచ్చింది.

"ఒకపని ఏమిటండి!-చెప్పండి ఆజ్ఞాపించు కిల్లియోపాత్రా! నైలులో దూకనా, పామును నేనుకూడా ముద్దు పెట్టుకోనా-చెప్పు ఏం చేయాలో-మరో తాజ్‌మహల్ బాబులాటిది కట్టివ్వనా ముంతాజ్! దానిమ్మతోట వేయించనా అనార్! చెప్పండి నిప్పుల్లో నడవనా-అల్లాఉద్దీన్‌తో పోట్లాడి దీపం తెమ్మంటారా - ఏం చేయమంటారు పైన పేర్కొన్న వాటిల్లో" అని మనసులో అనుకుని వుంటాడు నోటినుంచి మాత్రం

"చెప్పండి - అల్లాఉద్దీన్!" అని వచ్చింది.

వసుంధర భయపడ్డట్లుంది. తనే పొరపాటు వినుండచ్చు....ఛ అతనెలా అల్లాఉద్దీన్ అంటాడని అనుకుంటుంది-అందుకనే.

"రేపు మా యింటికి రాగలరా-మనకాలిడేగా!" అంది.

వాడు తన చెవులను తనేనమ్మలేక పోయుండాలి. వాడేమిటి నామటుకు నేను నమ్మలేను. ఏమిటి- తనను-అచ్చంగా తననే యింటికి రమ్మంటోంది. నాయనోయ్! ప్రేమచిగురించ బోతున్న సమయంలో గోపాలం వెను

> సినిమా హాలులో -
>
> ఒకరు ; నేను అసభ్య సన్నివేశాలుగల దృశ్యాలప్పుడు కండ్లు మూసుకుంటాను.
>
> పక్కనున్న పెద్దమనిషి: దయచేసి మీరు కండ్లు మూసుకొనే ముందు నన్ను నిద్రలేపండి.

కాడుతాడా?

"విత్ అల్ ప్లెజర్" అన్నాడు.

వసుంధర మనసుమార్చుకుందేమో "పోనీలెండి మీకెందుకు శ్రమ నేనే కాలేజికి పట్టుకు వస్తాను ఎల్లుండి" అంది. అప్పుడు గోపాలం మొఖం చూడాలి! షేక్స్పియర్ యింతకన్న బాగుండుండేవాడు. మనిషి ప్రవహించ బోతున్నాడు.

"అబ్బె దీనిలో శ్రమేం వుందండి! తప్పకుండా వస్తాను. వస్తానండి మరి థాంక్యూ....వుంటానండిమరి' తొందర తొందరగా అనేసి వెనక్కు తిరి బోయాడు.

"మరి మాయిల్లు తెలుసా అండీ!" వసుంధర అంది.

''భలేవారే! మీ యిల్లు తెలియక పోవడమే. వస్తానండి.'' అని బాటనీ లాబ్‌వైపు గాలిలో యీదసాగాడు. ఆ అమ్మాయి వీడిచ్చిన జవాబుకు సన్నగా నవ్వుకుంది. నాకు తెలుసు అమ్మాయిలు అలా ఎందుకు ఎప్పుడు

ఆమె : మావారికి చాలా జ్వరంగా ఉంది. ఓ ధర్మామీట రివ్వండి.

ఆయన : ఫార్న్‌హీటా ? సెంటీగ్రేడా ?

ఆమె : దేనివల్ల వేగంగా జ్వరం పోతుందో అదివ్వండి.

నవ్వుతారో! పిచ్చి వెధవ చెవులకు తాటాకులు కడ్తుంది.

వీడి ప్రేమ విషయం రాత్రి రూంలో ఓ చిన్న సైజు సిసిల్ వారయింది. బాబ్జిక వీడికీ యీమధ్య అసలు పడటంలేదు. ఓవర్ బ్రిడ్జి కొలచి రాత్రి రూంకి వచ్చి తలుపు తట్టబోయి లోపలినుంచి మాటలు వినబడడంతో .... చెవులు రిక్కించాను. "నీకు బుద్ధిలేదురా గోపాలం! నీవు ఎవరివి? చెప్పు ఎవరివి? ఫూల్‌వి, యిడియట్‌వి, హోటల్ సాంబర్‌లో వచ్చే బొజ్జెంకవి, కుక్కవి, పిల్లివి, [illegible]వి, దోమవి.....తిట్ల సహస్ర [illegible]మం వినపడుతుంది. అది బాబ్జి గొంతుగాదు. ఎవరు? ఎవరు అంత ధైర్యంగా వచ్చి మా గోపాలాన్ని తిడుతున్నది. నేను సమయానికి రావటం మంచిదయిందని తలుపుకొట్టి, తెరుచుకోగానే లోపలికి పోయాను. మనిషి వాలకం ఎమిటోగా వుంది. తిట్ల తాలూకు మనిషెవరో ఒక విడత వాయించుంటాడనిపించింది వాడి అవతారం చూస్తుంటే "బాగా తగిలాయా" అన్నాను. ఖాళీ రూంలో దృష్టి నాలుగు పైపులు పోనిస్తూ.

వాడు నావైపు పెద్ద వేదాంతిలా చూసాడు. విగతగా నవ్వాడు. "అది సాలోలిక్వి (ప్రకాశముగా స్వగతం) రా చిట్టీ! నేను రిపెంటవుతున్నానురా. నన్ను నేనే తిట్టుకుంటున్నానురా ఫూల్!" అన్నాడు యోగి వేమనలా మరోసారి నవ్వి.

"ఏం ఇదా- బేగి సెప్పె హే?" అన్నాను.

"ఏముందిరా! ప్రొద్దున కాలేజిలో వసుంధరతో మాట్లాడానా? ఆఅమ్మాయి యింటికి రమ్మందిరా! అన్నాడు దాదాపు ఏడుస్తూ (గ్లిసరిన్ లేకుండానే)

"ఇంకెందుకురా ఏడుపు చిట్టి తండ్రీ! ఏది నవ్వమ్మా! నవ్వు .... స్మయిల్ ...."

"నీకు నవ్వుగానే వుంటుందిరా చిట్టీ! ఆ అమ్మాయి యిల్లు తెలుసా అంటే "ఓ! తెలుసుననేశానురా! ఆ అమ్మాయి ఏమనుకుంటుంది చెప్పు. వీడికి యిలా అందరిళ్లూ తెలుసేమో!" బుక్కాఫకీర్‌లా యిలా యిళ్ళు చుట్టు తిరిగి ఎడ్రస్‌లు తెలుసుకునేరకమేమో- వీడినా నేను ప్రేమించేది-" అని అనుకోదూ.... చెప్పరా చిట్టి అనుకోదూ!" అన్నాడు దీనంగా.

"కోదురా నాన్న... కోదు. ఏం అనుకోదుగాని రేపు క్షేమంగా వెళ్ళి లాభం

గానో పోనీ వయిస్‌వర్సాగాని తిరిగి రారా!" అన్నాను.

నా మాటలు ఓ ఓ సెవెన్‌లా తలుపు దగ్గర నుంచి వింటున్నాడేమో "ఎందుకు కోదురానాన్నా! తప్పకుండా కోదుతుంది. వీడిని ప్రేమించ వేమిటి! నీ పిచ్చిగాకపోతే!" అంటూ ప్రవేశించాడు బాబ్జి డ్రామటిక్‌గా.

"ఒరేయ్ బాబ్జి! నన్ను అనరాపడ్తాను, కొట్టరా తన్నులు తింటాను. చొక్కా చింపరా యింకోటి కుట్టించుకుంటాను. అడ్వాన్స్ చేయించుకున్న టికెట్లుతీసుకోరా-బ్లాక్‌లోకాని వెళ్తాను. కాని ఒరేయ్ బాబ్జి! ప్రేమను-ప్రేమించడాన్ని అనకురా నేను చాలా ఫీలవుతాను." అన్నాడు దీనాతిదీనంగా. వాడు ఫీలవటం చూసి నేనూఫీలవటం ప్రారంభించాను. నాకుబాబ్జిగాడి(ద)మీద కోపం వచ్చేసింది. బాబ్జికిదంతా పెద్ద జోక్‌లా వుందేమో, పౌరాణిక చిత్రాలలో పేరున్న హీరో సాంఘికాలలో అసందర్భంగా రాజనాలలా నవ్వినట్లు నవ్వసాగాడు; "నవ్వకమ్మా బాబ్జి-నవ్విన నాపచేను గాబోలు పంట కొస్తుంది" "అంటున్న నా మాటలు వినిపించుకోకుండ.

"ప్రేమాలేదూ మీ పిండాకూడులేదు గాని- నా మాటలు విని లీలామహాల్లో మంచి పిక్చరేదో వుందిట. పోదాం పదండి" అన్నాడు.

"బాబ్జీ! గోపాలం గొంతు పీలైనంత గంభీరంగా వినిపించింది. "నా ప్రేమను....నా ప్రేమను కించ పరుస్తావురా! వెళ్ళు నా ముందునుంచి వెళ్ళు. నేను నీకు గోపినికాదు నీవు నాకు బాబ్జివి గావు" అన్నాడు సినిమాలో హీరో తండ్రిలా.

"ఏం చేస్తావురా! చెవులు కొట్టి మొలేస్తావా? డబ్బింగ్ సినిమాకు తీసుకువెళ్తావా? ఏం చేస్తావురా?" అన్నాడు బాబ్జి నవ్వుతూ.

నలభై డిగ్రీల కోణంలో గోపాలం నావైపు తిరిగాడు.

"ఒరేయ్ చిట్టీ నాలోని గోపాల్రావ్ లేవకముందే వీడిని యిక్కడ నుంచి వీక్ని పంపేయరా! లేకపోతే వాడిని ఆత్మహత్య చేసి నేను హత్య చేసుకోవాల్సి వస్తుంది."

వాడి మాటలు తడబడుతున్నాయి. నాకు చాలా భయంవేసింది. హత్యలు జరిగితే ఫరవాలేదుగాని కోర్టులచుట్టూ తిరగాలి. దానికన్న కాలేజీలు క్లాసులే నయం! బాబ్జికో సిగిరెట్టిచ్చి పంపానవతలికి.

మరునాడు తెల్లవారురూ[illegible] మిది గంటలకు లేచేసరికి [illegible]

"నీకాలు ఎలా విరిగిందిరా గోపీ!"
"ఏం లేదు కాల్చడం అయిపోయాక సిగరెట్ పీక మేడ కిటికీలోంచి బయటికి విసిరేసి అలవాటు ప్రకారం దాన్ని బూటు కాలితో ఆర్పబోయాను."

లోంచి పాటలు వినపడుతున్నాయి. "ఓ తుమ్‌సే అచ్ఛా కౌన్ హై?" మార్కెవి. "ఒరేయ్ గోపిగా బాత్ రూంలోంచి ఊడిపడరా యింకచాలు గాని" అని అరిచాను. "లేమురా చిట్టీ! ఈ సబ్బు సగంకూడా అరగందే! కాసేపు వుండు - అయినా ఒకపూట స్నానం లేకపోతే ఛస్తావేమిటోయ్?" అని కసురుకున్నాడు. చాలా సేపయ్యాక బయటకొచ్చి, చుట్టూ అద్దాలు పెట్టుకుని ట్రిమ్‌గా తయారయి "మరి వస్తారా" అని స్కూటరెక్కాడు, నా విష్‌యూ బెస్టాఫ్‌లక్'కు ఓ అందమైన చిరునవ్వొకటి నా మొఖానకొట్టి.

నేను మెస్‌కు వెళ్ళి వచ్చి పడుకున్నాను. ఆ భోజనం ఒక గమ్మత్తు. అయ్యర్ నాలుగయిదు అయిటమ్స్ విస్తరిచుట్టూ వేసినా అన్నిటి రుచీ ఒకటే. భగవంతుడు ఒకడే వేరు వేరు రూపాలలో వున్నట్టు. ఇవాళ అన్నం పెరుగూ గాక మిగతావి ఏమయివుండ వొచ్చు - అని ఆలోచిస్తూ పడుకున్న వా స్కూటర్ శబ్దానికి మెలుకువ చూసాను. గోపిగాడు స్టాండ్ లోపలికొస్తున్నాడు. మసిషి డిపా పోయిన యమ్మెల్యేలా పాలిపో యున్నాడు. ఎన్‌సీసీ పరేడ్ చేసి వచ్చినంత యిదిగా వాడిపోయున్నాడు. వెధవకు ఏదో సత్కారం జరిగుంటుంది. ఆ వసుంధర తలవాచేట్లు చివాట్లు పెట్టుంటుంది. మీసాలాయన ఒక పట్టుబట్టి వుంటాడు - అయినా నాకెందుకులే అని ప్రక్కకు వత్తిగిల్లి పడుకున్నాను. కాసేపు ఆగాక వాడే తట్టిలేపుతుంటే మెలకువ వచ్చి ఏమిట్రా "న్యూసెన్స్?" అంటూ లేచి కూర్చున్నాను.

"అవునురా ఫూల్ న్యూసెన్స్‌గానే వుంటుంది! మిత్రుడు కష్టాలలోవుంటే న్యూసెన్స్‌గానే వుంటుంది...." యింకేదో క్యారక్టర్ ఏక్టర్‌లా ప్రారంభించాడు సొద. నాకేం పాలుపోలేదు.

"అసలు సంగతేమయినా వుంటే చెప్పి ఏడ్వరాదూ!" అరిచాను. నాకు కాస సంతోషంగానేవుంది. లేకపోతే బస్‌స్టాండులో వున్నంతసేపో, క్లాస్‌లో చూస్తున్నంతసేపూ ప్రేమిస్తే పోలా - అంత అందమయిన అమ్మాయిని అచ్ఛంగా ప్రేమించటమేనా?

"చెబుతానురా చిట్టీ!" బాధయింకొకరితో చెబుతేనయినా కొ స్తమనశ్శాంతి లభిస్తుంది." అన్నాడు. నవలిష్‌గా, సినిమాటిక్‌గా.

కొద్దిసేపు నేను వాడి మొఖంలో చూస్తూ కూర్చోవటం మినహా ఏమీ చేయలేదు.

కొన్ని క్షణాలు గడిచాకహఠాత్తుగా వాడేఅన్నాడు. "ఒరేయ్‌చిట్టీ" నీకు చెస్ వచ్చుగదూ! నాకు నేర్పరా చచ్చి నీ కడుపున పుట్టాను. నీవు నాకు అప్పు తీర్చుక్కరలేదు. అప్పారావు మీద ఒట్టు."

''ఏఁవిట్రా నీసంధివాగుడు చెస్‌కూ దీనికీ ఏం సంబంధం?' అసలు సంగ

తేమిటో అఘోరించు ప్లాటినమ్ లాటి నిద్ర పాడ్చేశావు!'' అన్నాను.

''ఉందిరా బంధం - డియర్ సంబంధం! ఆ బంధమే చిగురిస్తే నీవు నాకు ఆత్మబంధువ్వవుతావు....'' ప్రాసమూసలో పోసి నా ప్రాణాలు ఎక్కడున్నాయో వెతికి కరకరా కొరికేసాడు, ఆరోజంత యింక నాకు నిద్ర లేదు-వాడికి నేర్పుతూ. చిలకలా కులుకుతూ అసలుసంగతి బయట పెట్టాడు. అసల్జరిగిందిదిట.

వీడు వెళ్ళేసరికి వరండాలో వాళ్ళ లైకా పడుకుని వుందిట. అప్పటికీ 'బివేరాఫ్ డాగ్స్' బోర్డుందేమోనని చూసాడుట.లేకపోయేసరికి ధైర్యంగా లోపలికి వెళ్ళాడు. ఇంకేముంది? మన వాడిని లైకా ఫిఫ్టీమీటర్స్ డాష్ చేయించిందట. ఆ మీసాలాసామి, అదే వాళ్ళ బాబాయి గజేంద్ర మోక్షంలో విష్ణుమూర్తిలా అడ్డుపడి ఆపకపోతే కార్టూన్ సినిమాలా అలా తిరుగుతునే వుండేవాడు. వాళ్ళిద్దరి మధ్య సంభాషణ యిదిట.

''ఏమిటి మా కుక్కముందు పరుగెడుతున్నారు?''

"అరే! వెనుక కుక్కవుందా? నే చూడనేలేదే! వెనుక కుక్క వుందన్న మాట! భలే వారే వుందన్నమాట 'గమ్మత్తేనే! అయినా మీరు చెప్పాక వుండక పోవడమేమిటి? వుండే వుంటుంది. నావెనక కుక్క వుందన్న మాట! హౌ ఫన్నీ! కుక్క....'' వాడు ఏం మాటాడుతున్నాడో వాడికే తెలియటంలేదు. ఆయాస పడిపోతున్నాడు. టక్ లూజయింది. కష్టపడి దువ్వుకున్న క్రాప్ చెరిగిపోయింది.

పిచ్చాసుపత్రి ప్రాణి అనుకున్నాడేమో ఆయన "ఏవారు?" అన్నాడు. వీడు షాక్‌తిని వార్దేమిటి చెప్మా అని ఒక సెకనులో అరక్షణం ఆలోచించి తట్టిన వెంటనే "నోనో మీ గార్డన్ బావుందనిపిస్తే చూస్తున్నాను సార్! ఎలాగయినా మీది మంచి సెన్సాఫ్ హ్యూమర్ వున్న మనసు లెండి."

"అడ్సరేగాని ఎవరు నువ్వు?" మీసాల వెనుకనించి నవ్వాపుకుంటూ అడిగాడు.

"మీరెంత పెద్దమనిషైనా ఏకవచన ప్రయోగం కూడద్సార్?" అని మనసులో అనుకుని.

"నేనండి ....గోపాల్రావ్‌ని!" అన్నాడు నన్నే గుర్తుపట్టలేదా పూర్ క్రీచర్ అని ధ్వనించేట్లు.

"అయితే ఏంకావాలి?"

"నేనూ ఏపీకాలేజీలో బియస్సీ

---

● ఇంటావిడ:- ఏరా? సుబ్బిగా యింత ఆలస్యంగా వచ్చావ్?

పాలవాడు:- ఇంట్లో నా పెళ్ళాం కోడెదూడను ఈనిందమ్మా అందుకు కొంచం లేటయింది.

సార్" అని యిక ధైర్యం తెచ్చుకో పోతే లాభం లేదని "మీఅమ్మాయుం దాండి?" అన్నాడు.

"లేదు స్కూల్‌కి వెళ్ళింది" ఆ దెబ్బతో వీడికంతా అయోమయమై పోయింది. కుక్క చేసిన హడావిడి తగ్గనే లేదు ఈయనగారి విట్లాటకు యిదా సమయం?

"సారి సార్! రాంగ్ అడ్రస్‌కు వచ్చాను" అనిరాబోయాడట.

ఇంతలో "బాబాయి!" అని వసుంధర బైటకొచ్చింది. వీడ్ని చూడగానే "అరే అదేమిటండీ! వెళ్ళిపోతున్నారు. రండి రండి అని మర్యాదగా ఆహ్వానించింది. మనవాడు పోయిన ప్రాణాలను వెతికి తెచ్చుకుని లోపలికెళ్ళాడు, తరువాత వాళ్ళ బాబాయికు పరిచయం చేసింది. "ఇతను నా క్లాస్‌మీట్.... పేరుకోసం వెతుకుతుంటే, "నాపేరు యిందాక చెప్పినట్లు గోపాల్రావేనండి' అన్నాడు.

"మీకు రష్యన్సంటే ఇష్టమా?" అని ప్రశ్నించాడు బాబాయిగారు.

"మరేనండి. రేపు బియస్సీ కాగానే. యమ్మెస్సీచదివి పి. హెచ్.డి తీసుకుని బుముంబా యూనివర్శిటీకి వెళ్దామను కుంటున్నాను" అన్నాడు.

"వెరిగుడ్ .... కారీ ఆన్! యిది నా రెస్ట్ టైమని" 'వెళ్ళిపోయాడు' ఆయన. సరే! వాళ్ళిద్దరు సంభాషణ కుపక్రమించారట.

"మీరు ఎక్కడయినా స్కూల్లో పార్టుటైమ్ జాబ్ చేస్తున్నారాండీ!" అన్నాడు వీడు రేడియో ట్యూన్ చేస్తున్న వసుంధరతో.

"ఎలాగయినా మీరు గమ్మత్తుగా (ఆ అమ్మాయి ఉద్దేశ్యంలో 'అసందర్భంగా' అయివుంటుంది.) మాట్లాడతారండీ!" అంది.

"నో... నో మీ గురించి అడిగితే మీ అంకుల్ స్కూల్‌కు వెళ్ళారని చెప్పారండి."

ఆ అమ్మాయి పలువరుస బయటపడేట్లు వీడి గుండెలు ఏడో బాధతో మెలికలు తిరిగిపోయేటట్లు, మెలికలు తిరిగిపోతూ పకాపకా నవ్వింది. "అది మా చెల్లాయండి బాబూ!" అంటూ. వీడు ఏడ్వలేక నవ్వాడు. (అది వేరే సంగతి).

రేడియోలోంచి సన్నని గొంతుతో లత పాడిన పాటవస్తోంది. వసుంధరే అందిముందు. "ఆ లతకు దేవుడిచ్చిన వరమండి. అబ్బ ఎంత కమ్మటి కంఠమండి?" అని.

"మరేనండి! క్లిఫ్ రిచర్డ్‌కన్న బాగా పాడుతుంది" (వాడి బొంద కంపారిజన్ అంటాడు బాబ్జి).

"మీరు ఇంగ్లీషు పిక్చర్స్ ఎక్కువ చూస్తారనుకుంటాను."

"మరేనండి! అందుకనే తెలుగు

సినిమాల గురించి అసత్తెలియదు, అసలు నేను తెలుగు సినిమా చూసి ఎంత కాలమయిందో!'' (వెధవ అన్నీ కోతలు .... విఠలాచార్య సినిమాకు మొదటి రోజు క్యూలో తయారు మళ్ళీ!)

అవి-యివి-అన్నీ మాటాడి తెలుగు నోట్సు పట్టుకు వచ్చేస్తుంటే మళ్ళీ బాబాయి ఉరుఫ్ విలన్ చూసాడు.

"ఆగు!''

వాడు ఉలిక్కిపడి వసుంధరవైపు చూశాడు నీవేతప్పయితఃస్వరంబెరుంగ అన్నట్లు.

"నీకు చెస్ వచ్చా!''

''ఛస్-రాదండి....!'

''ఇంకా వచ్చనుకున్నాను. రష్యా వెళ్తా చెస్ నేర్చుకోవూ - ఈమారు నేర్చుకుని మరీరా!'' అన్నాడాయన.

ఇంత కథవుంది చెస్ నేర్పమని అడగటం వెనుక. ఈమాటే బాబ్జితో అంటే ''లేకపోతే వాడికి చెస్ ఎందుకురా బుర్రలేనివాడికి. ఏ క్రీడనో ఆడుకోలేక'' అన్నాడు వాడు.

గోపాలం వసుంధరల మధ్య పరిచయం ఊఁ తెలుగు సినిమాలా పెరిగిపోతూనేవున్నది. మీసాలాయన్ను చెస్ వంకతో ఒక'పాన్' చేసేసాడెప్పుడో ఒకసారి వసుంధరతో సినిమాహాల్లో గూడా కనపడ్డాడు. ఇంకేముంది కాలేజంతా గోల! అమ్మనాయినోయ్! గోపాలం వసుంధరలు డ్యూయెట్సు పాడుకుంటున్నార్నాయనోయ్!'' అని.

వీడి నాన్నవాళ్ళకు ఒకడే కొడుకు. తద్వారా వాళ్ళబామ్మకు ఒకడే పెళ్ళిడుకొచ్చిన మనవడవటంతో వీడినాన్న. పెళ్ళిచేయాలని వుంది నీకు అని; ఆ సంబంధం చూసాము, యీ సంబంధం చూసాము, నీవు చూడమని....యిలా వ్రాస్తూండేవాడు. కథ త్రిప్పి పంపకుండా చెత్తబుట్టలో దాఖలు చేసినట్లు ఏంజవాబిచ్చేవాడు గాదు.

ఒకసారి టెలిగ్రాం యిచ్చాడు ఫలానా తారీఖున, ఒక పిల్లని చూడాలి బయల్దేరి రమ్మని. వీడుదానికి "ఫలానా అమ్మాయికు నోట్సు తీసుకుని బదులుగా మనసిచ్చేసాను. వాళ్ళ పెద్దవాళ్ళను కదప....'' యీ ధోరణిలో వుత్తరం వ్రాసి నాకు చూపించాడు బాబ్జి వుండగా. బాబ్జి అంతా చదివి ఒరే ఫూల్! ఆ అమ్మాయి వీడిని ప్రేమిస్తున్నదనుకుంటున్నాడురా! ధైర్యంచేసి అడగమను. కుండ కొనుక్కొచ్చయినాసరే పగలగొట్టి చెబుతుంది. ప్రేమించలేదని.

''ఒరే చిట్టీ వాడిమాటలకే[illegible] వాడికి కుళ్ళుగాని నీవుచెప్పరా నన్ను ప్రేమించటంలేదు ఆ అమ్మాయి?" -

ఏం చెప్పను? థియరి ప్రకారం ప్రేమించే వుండాలి. ''ఎందుకయినా మంచిది రేపు అదివారం కనుక్కొని ఏ సంగతీ వ్రాయరా మీ నాన్నకు'' అన్నాను.

ఆ ఆదివారం రానే వచ్చింది. వాడు వెంకటేశ్వరునికి మొక్కుకొని స్కూటర్ తీసాడు. వాడిరాకకోసం ఔట్ డోర్ ఎండకోసం ఎదురు చూసే ప్రొడ్యూసర్‌లా కూర్చున్నాం. పదయింది. పదకొండయింది. పన్నెండు గంటలు కొడ్తుండగా (గడియారం) వచ్చాడు. ఫాడి ఆకారం చూస్తేనే వూహించవచ్చు ఏం జరిగివుంటుందో! అయినా వుండబట్ట లేక అడిగాను.

ఏ జరిగిందమ్మా ''గోపాళం!'' అని.

వాడు బరువుగా నిట్టూర్చాడు. ఎటో చూస్తూ ఫిలాసఫించడం ప్రారంభించాడు. ''జీవితం యింతేరా! అనుకున్నవన్ని జరిగితే....'' (వాడు అన్న మాటలు తెలుగు సినిమాలు చూసి చూసి వున్నవారికి మరీ తలనొప్పి తెప్పిస్తాయని విడుస్తున్నానని మనవి) సినిమాల వాళ్ళలా హెవీ డైలాగులాడ[illegible]గాడు.

"సరే మామూలుగా వెళ్ళానా?"

మేము వింటూ కూర్చున్నాం,

"వసుంధర్గారూ మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలండి!"

"అంత ముఖ్యమా?"

"......................"

"అంత రహస్యమా"

"అటువంటిదే!"

తలుపులు వేసొచ్చి ఫ్రిజ్ లోంచి రెండు డ్రింక్స్ తెచ్చి వచ్చి కూర్చున్నదిట. ఒక నిముషం ఎలా అడగాలో తెలియక "మీరు నన్ను ప్రేమించారా?" అన్నాను హఠాత్తుగా.

"మిమ్మల్నా.. ఛీ..ఛీ.. అయినా అనెవరు చెప్పారు?" అంది. బాక్సులు తీసినంత వేగంగా తిరిగి వచ్చినంత నిరుత్సాహ పడి పోయాడు,

"అయితే యిన్నాళ్ళు మీరు..?"

"....ఊం.. నేను"

వాడికిక మాటలు రాలేదు.

"సాహృదయంతో ఆడుకున్నారన్న మాట. నన్ను మోసం చేశారన్నమాట" ఆవేశంగా అన్నాడు.

"ఎందుకలా ఆ వే శ ప డ తారు. డ్రింక్ తాగండి ముందు."

"ఛీ.. ఛీ అం ద రిలానే మీరూ నన్నమాట! కాస్త స్నేహంగా, చనువుగా వుంటే ప్రేమా పెళ్ళీ అంటారు"

"అయితే మీరు నన్ను ప్రేమించ లేదా?"

"లేదండి బాబూ! లేదు!"

"కాని మిమ్మల్ని నేను ప్రేమించాను."

"అయితే నన్నేం చేయమంటారు?"

అవును. ఏం చేయాలో వీడికి వెంటనే తడితేనా! కొద్దిసేపాగి పెళ్ళి సంసారం స్వర్గం మాటలు వుపయోగిస్తు ఏదో చెప్పబోతుంటే చెలియ

చెలియల కట్ట కట్టి ఆ వాక్ప్రవాహాన్ని ఆపి నిష్కర్షగా చెప్పింది

"అదేంలేదు గోపాలం గారు! మీరు నాకు స్నేహితులు. మంచి స్నేహితులు. ఎ గుడ్ బాయ్ ఫ్రెండ్. ఎప్పుడూ అలానే వుందాము."

"అయితే స్నేహం తప్ప యింకేం లేదా?''

"లేదు.. లేదు....లేదు'' వస్తున్న నవ్వాపుకుంటూ అన్నది.

"అయితే ... పద్ధొమ్మిది వందల అరవయితొమ్మిది ఫిబ్రవరి ఏడున గాబోలు నన్ను చూసి కాలేజీలో నవ్వారు. గుర్తుందా? ఎందుకు నవ్వారు మరి?''

''ఓహ్! మీకెంత జ్ఞాపక శక్తండీ! మీ ప్యాంటులోకి కాళ్ళు ఎలా దూరాయా, ఆ బూట్స్ లోకి పాదాలు ఎలా వెళ్ళాయా అని ఆలోచిస్తుంటే నవ్వొచ్చింది!"

''ఆ''

''అవును. చెబుతున్నాను! వినండి! మీ గొట్టం ప్యాంట్సు. బీటిల్ క్రాపులు చూసి ఆడపిల్లలు మీరంటే ఊరికే యిదయి పోతారను కోకండి. మీరు ప్రేమిస్తున్నారని అంటారుగాని.. మీరు చేస్తున్న పని మోహించటం. ప్రేమ మనసులకు సంబంధించింది.

స్నేహాన్ని, చనువును యిలా అర్థం చేసుకుని దానికి ప్రేమా దోమా అంటూ పేర్లు పెట్టకండి. పేర్లు పెట్టి వాటివిలువ పాడ్చేయకండి. సాటి మనిషయిన ఆడదాన్ని ఎప్పుడూ 'సెక్స్' దృష్టితోనే ఆలోచించటం మానుకోవాలి. మీకు కాబోయే వారి మీద ఎటువంటి ఊహలు నిర్మిస్తారో మేమూడిటోగానే నిర్మిస్తామని తెల్సు కోండి. ఇలా చెబుతున్నానని ఏమనుకోకండి-అయినా యిది పెద్దవాళ్ళ సమస్య-యిలా చెబుతున్నానని వూరికే యిదయి పోకండి. లీలామహల్లో ఏదో ఛేంజి వుందిట. కంపెనిలేదు, వెళ్దాం, సాయంత్రం తప్పకుండా రండి మరచిపోకుండా''

ఆ అమ్మాయి అలా నిష్కర్షగా తెగేసి చెబుతుంటే మానవుడు ఏం మాట్లాడుతాడు? కాసేపు వగర్చాడు. ఎవరన్నా బాక్ గ్రౌండ్‌లో ఓ ట్రాజెడీ సాలో పాడుతారేమోనని చూసాడు. ఇక అక్కడుండ కుండ "ఛీ! మోసం ప్రేమ.... జీవితం... " అంటూ బైటికొచ్చేసాడుట. సినిమా హాల్లో చివగ జాతీయ గీతం వేయక ముందే త్వర త్వరగా బైటపడ్డట్లు.

తలలోకి రెండు చేతులు పోసి "ఏదయినా బాబ్జిమా ఛే నెగ్గిందిరా చిట్టీ!" అంటూ ముగించాడు.

కథ అయిపోయిందని చప్పరించేవారు యింకొద్దిసేపు మరో కథకు పోకుండా ఓపిక పట్టాలని మనవి. ఆరోజు రాత్రి గోపాలం వాళ్ళ వూరు ప్రయాణమయ్యాడు వాళ్ళ నాన్న

వ్రాసిన మాచ్ చూడటానికి. ఇందులో ఆశ్చర్యపోయేందుకు ఏంలేదు. కాని ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే వసుంధర వాళ్ళ బాబాయి. ఉరఫ్ మీసాలాయన మర్నాడు గదీ వెతుక్కుంటూ వచ్చాడు ఫలానా వారబ్బాయి గోపాల్రావుండే రూమిదేనా అని. దరిమిలా కొంత కాలానికి "అయ్యా! పెళ్ళికొడుకు గారి స్నేహితులుండే విడిదిదేనా?" అని కూడా వచ్చాడు.

సరిగా, అయన వచ్చే ముందే మా గోపాలం విడిది డాబాపైన అందరి మధ్య పరివేష్టితుండయి వున్నాడు. "సరేగాని గోపాలం! ఎలా యిలా? జరిగిందిరా?" అన్నాను వాడి పెళ్ళి బట్టల వైపు చూస్తూ. దానికి వెంటనే జవాబు వచ్చింది. గోపాలం నుంచి కాదు బాబ్జి నుంచి. ఆ(ఏముందిరా? ఆ మాచ్ యీ మాచ్, యీమాచ్ ఆమాన్, ఆమాచ్‌లు యీమాచ్‌లు, యీమాచ్‌లు ఆ...." వాడి రికార్డు ఆపించాలని అన్నాను.

...ంటే ఎప్పుడూ పడే కథల్లోలా, ...సినిమాల్లోలాకాకతాళీయమనా?"

"ఎంత పందెం?"

"దేనికి ఎంత పందెం?"

అదే నేను పైపేరాలో అన్నానే! దానికి. యిది గ్యారంటీగా యాదృచ్ఛికంగా మారని పందెం?" కావాలంటే వాడ్నే అడుగు ముసిముసి నవ్వులు ప్రాక్టీస్ చేస్తున్నాడుగా..."

మేమంతాగోపాలంవైపు చూసాం. గోపాలం ఆకాశంకేసిచూసాడు. "నీవు పందెం కాయాల్సింది" అన్నాడు నావైపుతిరిగి. మళ్ళీ ఆకాశంకేసి చూసాడు, సిగిరెట్టు ముట్టించి.

"పైన ఏమిటుంది?"

"నీతలకాయ!" బాబ్జివిసుగ్గా అన్నా నిజమే అన్నాడు.

"కాదనను. మబ్బులూ కూడా లేవూ?"

"అరేయ్.... బోర్...."బాబ్జి మాటలు పూర్తి చేయనీ కుండా గోపాలం అన్నాడు "ఆరోజు అదే నేను రూంవిడిచి వెళ్ళిన రోజు యిలాగే మబ్బులున్నాయి. మా వూళ్లోను వున్నాయి. ఆ మబ్బుల్లాగానే దిగులు పడుతూ యింట్లోకి వెళ్ళాను. నాన్న హాల్లోనే ఆపి ఉరిమాడు. "యిప్పుడేనా అఘోరించడం?" అని. వెంటనే మరో పిడుగు లాంటి కేక వేసాడు. అమ్మని పిలుస్తూ.

ఆయన మాట పూర్తి చేయడమే ఆలశ్యం అమ్మా ఆమె అత్తగారు, అత్తగారి మనవరాలు అందరూ తయారయ్యారు తెలుగు సినిమా చివర్లో అంతా గ్రూప్ ఫొటోకు తయారయినట్లు.

కోపంగా చూస్తూ అన్నారు నాన్న "నీకు బుద్ధుందా అసలు?"

నేను చెల్లాయి వైపు చూస్తూ అన్నాను. "చెప్పేయగూడదూ వెంటనే ఏసంగతీ? ఆయన అంతయిదిగా

డుగుతుంటే?"

"నిన్నేరా" అంది అమ్మ.

నాన్న నా జవాబు కోసం ఆగలేదు. "నా కడుపున చెడపుట్టావురా! పులి బిడ్డవి యిదేంపనిరా నీకు? ఆ అమ్మాయిని చేసుకుంటానని చెప్పి యిలా యింటికి వచ్చేస్తావా- ఎంత అప్రదిష్ట? ప్రేమించటం తెలుసుగాని- పెళ్ళి చేసుకోవటం యిష్టంలేదన్నమాట? మరి బొంబే అమ్మాయిక్కడ చేస్తే యీ ఆంధ్రదేశంలో కుదరదూ!— ఇప్పుడే వచ్చాడు వాడికి కాసిని కాఫీ అన్నాయివ్వండి- పెళ్ళి చేసుకుని యింటికి తీసుకొస్తే వద్దంటానా? ఏమిటో ఈ ప్రేమలు?"

ఈ ప్రేమలు సంగతి నాన్నగారికే కాదు, నాకూ అర్థం కావడంలేదు.

"ఈ అమ్మాయి అమ్మాయట్రా.... అసలు?" అంది అమ్మ నాన్న చేతిలోంచి అందుకొని ఒక ఫొటో చూసి. వాళ్ళు ఎవరి విషయం, ఎందుకు, ఎలా, ఎవరు మాట్లాడుతున్నారో అర్థం కావటం మానేసి చాలా కాలమయింది.

"కాదు.. కానే కాదు." అన్నాను ధైర్యం తెచ్చుకొని.

"ముత్యంరా.. ముత్యం .... కడిగిన ముత్యం" అంది నాయనమ్మ కళ్ళజోడులోంచి ఫొటో చూస్తూ. ఆ దెబ్బతో సభ్యత కాకపోయినా నాకొక ఆలోచన వచ్చింది- ఎప్పుడూ త్రాగని నాన్నతో సహా అందరూ మందు పుచ్చుకున్నారేమోనని.

నాన్న జేబులోంచి ఓ వుత్తరం తీసిచ్చాడు.

"ఏముందిరా అందులో?" అన్నాను కుతూహలం చంపుకోలేక.

"ఒరేయ్ గోపాలం తండ్రీ! ఏం కొడుకును కన్నావురా! అమ్మాయిని ప్రేమించి "మా నాన్న...." అన్నాడుట. నాకూతుర్రా పులిబిడ్డ! "నాన్నా! నాన్నా యిఫెటాల్ పెళ్ళి చేసుకుంటే ఆ గోపాళాన్నే చేసుకుంటా లేకపోతే .... యింకో సంబంధం చూడనే వద్దు" అంది. ఎలాగయినా ఆడపిల్ల తండ్రినిగా "ఆడపిల్లాడి" తండ్రి దగ్గరకు రాక తప్పుతుందా- అందుకనే వీలు చూసుకొనివస్తాను. ముహూర్తాలు కలిసి వెతుకుదాం!" సరేనా....

"యిలా చాలా వ్రాసాడులే మావడు." గోపాలం ముగించక ముందే అందుకున్నాడు బాబ్జి "సిగ్గులేకపోతే సరి...." యింకా ఏదో అనబోయినవాడు 'మీసాల బాబాయి' ను చూసి ఆగిపోయాడు.

"ఏమిటయ్యా ఇక్కడ కూర్చు[illegible]న్నావ్? ఒక గేమ్ వేద్దాం రారా[illegible]" అన్నాడు ఛెస్ తలుచుకుని లొట్ట[illegible]కుంటూ.

"క్షమించాలి పెద్దవారు.. వాడికింకో గేముంది. యిప్పటికి ఒగ్గేయా[illegible] తప్పదు." అన్నాన్నేను.

ఏం గేమట అది?"

ఎవరో అరిచారు "మలిప్లికేషనిట్స దనేమాఫెగేమ్-ఎవిర్జనరేషన్ విల్ప్లేదిస్గేమ్!" నా? హూసేస్ ఎర్త్ యీజ్ నాట్ రౌండ్? ●●●